షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

1st Year Happy Work Anniversary.

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 3 సంచిక : 111
సోమవారం 27 ఏప్రిల్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## టీఎంసీ ఉన్నంతకాలం బెంగాల్‌లో మహిళలకు రక్షణ ఉండదు: మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 26)

తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉన్నంతవరకు బెంగాల్‌లో మహిళలకు రక్షణ ఉండదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. స్త్రీలను హింసించే గూండాలకు ఆ పార్టీ అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అందువల్లే రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఈసారి ఎన్నికల్లో భాజపాను గెలిపిస్తే మహా జంగిల్ రాజ్ నుంచి రక్షణ కల్పిస్తామన్నారు. మహిళల రక్షణ గురించి తాము ఆలోచిస్తాం కాబట్టే ఆర్జీకర్ మృతురాలి తల్లికి తమ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల టికెట్ ఇచ్చామన్నారు. బెంగాల్‌లో తాము అధికారంలోకి ▶మిగతా 2లో

## రాష్ట్రవ్యాప్తంగా ప్రజాదర్బార్‌లు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 26)

ప్రజాసమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజాదర్బార్‌లు నిర్వహిస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రజాదర్బార్ రూపంలో ప్రభుత్వాన్ని ప్రజల ముంగిటకు తీసుకొస్తున్నామని, సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు తొలుత ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోనే శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ఈ మేరకు శనివారం నేలకొండపల్లి మండలం రావిగూడెం క్లస్టర్‌గా... దాని పరిధిలోని పది గ్రామాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ▶మిగతా 2లో



## నేటి నుంచి పెంచలకోన బ్రహ్మోత్సవాలు... సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

పెంచలకోన బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం
సీఎంను కలిసి ఆహ్వాన పత్రిక అందించిన ఎమ్మెల్యే కురుగొండ్ల
ఈనెల 27 నుంచి మే 3 వరకు జరగనున్న ఉత్సవాలు
ముఖ్యమంత్రికి స్వామివారి ప్రసాదాన్ని, ఆశీర్వచనం అందించిన అర్చకులు
ఉత్సవాల ఏర్పాట్లపై ఆరా తీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 26)

ముఖ్యమంత్రి చంద్రబాబును నెల్లూరు జిల్లా పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాల్సిందిగా ప్రత్యేకంగా ఆహ్వానించారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆలయ పాలకమండలి ఛైర్మన్ తిరుపాల్ రెడ్డి సోమవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఈ సందర్భంగా, ఈ నెల 27 నుంచి మే 3వ తేదీ వరకు వైభవంగా జరగనున్న పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు తప్పనిసరిగా రావాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. వారి వెంట వచ్చిన ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు చిత్రపటాన్ని బహూకరించారు. ▶మిగతా 2లో

## నేటి కల్లా ఎక్కడా పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు కనిపించకూడదు

ఏపీలో పలు చోట్ల ఇంధన కొరత... పెట్రోల్ బంకుల మూసివేత
ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్న చంద్రబాబు
ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్
కంపెనీల అనుమతులపై పునరాలోచన చేయాల్సి వస్తుందని వార్నింగ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 26)

సోమవారం నుంచి రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు కనిపించడానికి వీల్లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయిల్ కంపెనీలకు స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా ప్రజలను, ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తే కంపెనీల అనుమతులపై పునరాలోచన చేయాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరతపై ఆదివారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజల నిత్యావసరాలైన పెట్రోల్, డీజిల్ సరఫరాలో బాధ్యతారహితంగా వ్యవహరిస్తే సహించేది లేదని సీఎం తేల్చి చెప్పారు. రిటైల్ ఔట్‌లెట్లకు క్రెడిట్ నిలిపివేసి, సరఫరా ఆపడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నయారా, రిలయన్స్ వంటి ప్రైవేట్ ఆపరేటర్లు సరఫరా నిలిపివేయడంతో సమస్య తీవ్రమైందని అధికారులు సీఎంకు వివరించారు. దీనికి తోడు వరికోతలు, ▶మిగతా 2లో

## పాకిస్థాన్‌కు మళ్లీ వచ్చిన ఇరాన్ విదేశాంగ మంత్రి..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 26)

చర్చలపై ఇరాన్- అమెరికాల మధ్య రెండో విడత చర్చలపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ పరిణామాల నడుమే ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మరోసారి పాకిస్థాన్‌కు చేరుకున్నారు. అమెరికా ▶మిగతా 2లో

## పల్లెపల్లెకు ఆర్టీసీ బస్సులు నడుపుతాం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 26)

రాష్ట్ర వ్యాప్తంగా రహదారి సౌకర్యం ఉన్న ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సులను నడుపుతూ ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపైన ఉప్పునుంతల మండల పరిధిలోని డిండికట్ట మైసమ్మ ఆలయ కొత్త పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డా.వంశీకృష్ణతో కలిసి పాల్గొని ఆయన మాట్లాడారు. దేవాలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ఇంకా బస్సులు వెళ్లని గ్రామాలను గుర్తించి బస్సుల్ని నడుపుతామన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలందరికీ సమాన న్యాయం కల్పిస్తున్నామన్నారు. మహిళాభివృద్ధిని కోరి ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు.ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధిని కాంక్షించి పాలకమండలి పనిచేయాల్సి ఉందన్నారు. దేవాలయ చరిత్రలో మొదటి పాలకమండలి ఇదే అన్నారు. రూ.10 కోట్లతో పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో డిండి డ్యాంలో బోటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. జాతీయ రహదారిపైన ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు. నూతన అధ్యక్షుడు ఎడ్ల నరేష్‌యాదవ్, సభ్యులతో దేవాదాయ శాఖ అధికారి మదన్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, నాయకులు కట్టా అనంతరెడ్డి, ▶మిగతా 2లో

## అణుశక్తిలోనూ భారత్ ముందడుగు: ప్రధాని మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 26)

అణుశక్తి పరిశోధనల్లో భారత్ మరో ముందడుగు వేసిందని ప్రధాని నరేంద్ర మోదీ (గ్రావీ చీుతీవఅనతీు వీశీంఱ) అన్నారు. తమిళనాడులోని కల్పకంలో ఉన్న 500 మెగావాట్ల ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ దేశ దీర్ఘకాలిక అణు వ్యూహంలో ఓ మూలస్తంభమని అభివర్ణించారు. ఈ విషయంలో మన అణు శాస్త్రవేత్తలు విజయాన్ని సాధించి దేశానికి గొప్ప పేరు తీసుకువచ్చారన్నారు. ఈ అణు రియాక్టర్‌ను పూర్తిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించడం విశేషమన్నారు. పౌర అణు కార్యక్రమాన్ని శాస్త్రవేత్తలు మరింత ముందుకు తీసుకువెళు న్నారని.. వారి కృషి దేశ నిర్మాణానికి గణనీయమైన తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. ఆదివారం మన్‌కీ బాత్ 133వ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ప్రస్తావించారు.మరోవైపు పవన శక్తి ఉత్పత్తిలోనూ భారత్ మరో మైలురాయి దాటిందని మోదీ చెప్పారు. దేశం ముందుకు వెళ్లాలంటే సౌర, పవన శక్తులు చాలా ముఖ్యమన్నారు. పునరుత్పాదక విద్యుత్తు వల్ల భవిష్యత్తు భద్రంగా ఉంటుందన్నారు. పవన శక్తి ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 56 గిగావాట్లకుపైగా పవన శక్తిని ఉత్పత్తి చేస్తున్నామన్నారు. గతేడాదితో పోలిస్తే 6 గిగావాట్ల పవన శక్తి అదనంగా ఉత్పత్తి అవుతోందన్నారు. ▶మిగతా 2లో

## అమెరికా అధ్యక్షులపై దాడులు.. ట్రంప్ నుంచి లింకన్ వరకు రక్త చరిత్ర



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 26)

"ఇది ఒక ప్రమాదకరమైన వృత్తి" - తనపై జరిగిన తాజా హత్యాప్రయత్నం గురించి ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన సమాధానం ఇది. శనివారం నాటి ఘటనతో కలిపి ట్రంప్‌పై ఇప్పటికి మూడుసార్లు హత్యాయత్నాలు జరిగాయి. అమెరికా చరిత్రను పరిశీలిస్తే, అధ్యక్ష పదవిని చేపట్టడం కత్తిమీద సాములాంటిదని అర్థమవుతుంది. రాజకీయంగా తీవ్రంగా చీలిపోయిన ఆ దేశంలో ఎందరో అధ్యక్షులు ఇలాంటి దాడులను ఎదుర్కొన్నారు. వీరిలో నలుగురు ప్రాణాలు కూడా కోల్పోయారు.

ట్రంప్‌ను వెంటాడుతున్న ప్రమాదం : అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఉన్న ట్రంప్‌ను ప్రమాదం నిరంతరం వెన్నాడుతూనే ఉంది. 2024 జులై 13న పెన్సిల్వేనియాలో ▶మిగతా 2లో

## మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు చిత్రపటానికి నివాళులర్పించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్







**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 26)**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నాదెండ్ల భాస్కరరావు నాలుగు రోజుల క్రితం కన్నుమూసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ భాస్కరరావు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం భాస్కరరావు కుమారుడు, ఏపీ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ని గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ధైర్యం చెప్పారు. ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో నాదెండ్ల భాస్కరరావు సేవలను ఈ సందర్భంగా మంత్రి స్మరించుకున్నారు.

## మా గ్రామంలో మౌలిక వసతులు కల్పించండి

### ఎస్టి కమిషన్‌కు పాలుట్ల గ్రామ ప్రజల మొర






**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఏప్రిల్ 26)**
యర్రగొండపాలెం పట్టణానికి అడవిలో 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాకు గ్రామంలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్టీ కమిషన్ కు పాలుట్ల గ్రామ ప్రజలు విన్నవించుకున్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ శనివారం రాత్రి పాలుట్ల గ్రామంలో పర్యటించింది. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సొల్లా బొజ్జిరెడ్డి ఇతర కమిషన్ సభ్యుల దృష్టికి గ్రామస్తులు పలు సమస్యలను తీసుకువచ్చారు. సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో త్రాగునీటి సమస్య ఉందని, అలాగే ఆరోగ్య కేంద్రం శాశ్వత అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో ఇల్లు కట్టుకునేందుకు, బావులు తవ్వుకునేందుకు అనుమతులు ఇవ్వాలని వేడుకున్నారు. అదేవిధంగా తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నామని గ్రామంలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కమిషన్ సభ్యులకు తెలిపారు. గ్రామంలో నాటు సారా కట్టడి చేయాలన్నారు. హౌసింగ్ మ్యాప్ లో లేకపోవడం వల్ల తాము ఎలాంటి పథకాలు పొందలేకపోతున్నామని గ్రామానికి చెందిన 40 కుటుంబాల వారు ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎస్టి కమిషన్ ఛైర్మన్ మాట్లాడుతూ అన్ని రకాల సమస్యలకు గరిష్టంగా మూడు నెలల్లో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టి కమిషన్ సభ్యులు కే లక్ష్మి, కే పరమేశ్వర్, భాజపా రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి వై రామచంద్రరెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మొదటిపేజీ తరువాయి

### నేటి కల్లా ఎక్కడా పెట్రోల్ బంకుల్లో

# ‘నో స్టాక్’ బోర్డులు కనిపించకూడదు

అగ్రి, ఆక్వా రంగాల నుంచి డీజిల్‌కు డిమాండ్ పెరగడం కూడా కొరతకు కారణమైంది. మూడు రోజుల క్రితమే సమస్యను గుర్తించినా ఎందుకు తక్షణ చర్యలు తీసుకోలేదని కంపెనీల ప్రతినిధులను సీఎం ప్రశ్నించారు. నివేదికలు కాదు, ఫలితాలు చూపించాలని ఆదేశించారు. ఈ సమస్యను తక్షణం చక్కదిద్దేందుకు ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్, కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బ్లాక్ మార్కెట్ అమ్మకాలు జరగకూడదని, రైతులకు ఇబ్బంది లేకుండా కూపన్ విధానంపై ఆలోచించాలని అధికారులకు సూచించారు. సరఫరాను వెంటనే సాధారణ స్థితికి తీసుకురావాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని చంద్రబాబు మరోసారి హెచ్చరించారు.

## టీఎంసీ ఉన్నంతకాలం బెంగాల్‌లో మహిళలకు రక్షణ ఉండదు: మోదీ

వచ్చిన వెంటనే మహిళలపై దారుణాలకు పాల్పడిన నిందితులను న్యాయస్థానం ముందు నిలబెడతామన్నారు. బంగావ్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.
రాష్ట్రంలో తరచుగా బాలికలు అదృశ్యమవుతున్న కేసులు నమోదు అవుతున్నాయని మోదీ పేర్కొన్నారు. అయినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిద్రపోతోందని మండిపడ్డారు. మహిళలతో పాటు రైతులు, కార్మికుల సంక్షేమం కోసం కేంద్రంలో భాజపా కృషి చేస్తోందన్నారు. అందుకే గత 11ఏళ్లలో జనపనార కనీస మద్దతు ధరల(మీఎస్పీ)ను రెట్టింపు చేసిందన్నారు. గోధుమలు, బియ్యం కోసం 100 శాతం జనపనార ప్యాకేజింగ్‌ను తప్పనిసరి చేశామని వెల్లడించారు. హుగ్లీ నది పరిసరాల్లో ఒకప్పుడు మిల్లులు, ఫ్యాక్టరీలు అధికంగా ఉండేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వాటన్నిటినీ మూసివేసిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే వాటిని తిరిగి తెరిపిస్తామన్నారు. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పిస్తామని హామీ ఇచ్చారు. బెంగాల్ అభివృద్ధి చెందాలంటే తాము అధికారం చేపట్టాల్సిందేనన్నారు. ఇదీ చదవండి: దీదీ, మోదీ దొందూదొందే

## రాష్ట్రవ్యాప్తంగా ప్రజాదర్బార్‌లు

గత ప్రభుత్వంలో ప్రజలు చెప్పులరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆక్షేపించారు. అలాంటి పరిస్థితి పునరావృతం కాకూడదనేదే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. కేవలం సభలు, వినతిపత్రాల స్వీకరణతో సరిపెట్టకుండా ప్రతి పంచాయతీకి అధికారులను కేటాయించి సమస్యలను లోతుగా అధ్యయనం చేస్తామన్నారు. పరిష్కారానికి వీలున్న వాటిపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమస్య ఏదైనప్పటికీ... న్యాయమైనదైతే ఇంటి పెద్ద కొడుకుగా పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ నెల 27 నుంచి ఉమ్మడి జిల్లాల వారీగా రెవెన్యూ, గృహనిర్మాణ శాఖలపై కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పెంచలకోన బ్రహ్మోత్సవాలు... సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

ఆహ్వానాన్ని స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యేను, ఆలయ ఛైర్మన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆయన సూచించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

## అణుశక్తిలోనూ భారత్ ముందడుగు: ప్రధాని మోదీ

ప్రతిఒక్కరు జనగణనలో పాల్గొనాలి..
ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న జనాభా లెక్కల ప్రక్రియ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని.. పౌరులందరిదీ అని మోదీ అన్నారు. ప్రతిఒక్కరు ఇందులో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని పూర్తిగా సురక్షితంగా, గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. భారత జనాభా లెక్కల ప్రక్రియ ప్రపంచంలోనే అతిపెద్దదని పేర్కొన్నారు. 2027 జనాభా లెక్కల వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేస్తున్నట్లు వెల్లడించా. సిబ్బంది మొబైల్ యాప్ ద్వారా ప్రజల వివరాలు నమోదు చేస్తారని చెప్పారు. తమ సమాచారాన్ని స్వయంగా నమోదు చేసుకునే అవకాశం కూడా ప్రజలకు ఇస్తున్నట్లు వెల్లడించారు.

## పాకిస్థాన్‌కు మళ్లీ వచ్చిన ఇరాన్ విదేశాంగ మంత్రి..

ప్రతినిధులు రాకముందే ఆయన ఇస్లామాబాద్ నుంచి ఒమన్‌కు వెళ్లిపోయారు. ఆ వెంటనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ ప్రతినిధులను పాకిస్థాన్‌కు పంపడం లేదంటూ ప్రకటించారు. గతంలో ఒమన్ వేదికగా ఇరాన్, అమెరికాల మధ్య పరోక్ష చర్చలు జరిగాయి. దీంతో అరాగ్చీ ఒమన్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పుడు ఆయన మళ్లీ పాకిస్థాన్‌కు చేరుకోవడం గమనార్హం. అయితే, రష్యా పర్యటనకు వెళ్లే ముందు అరాగ్చీ ఇస్లామాబాద్‌కు వెళ్లారని ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది.

## అమెరికా అధ్యక్షులపై దాడులు.. ట్రంప్ నుంచి లింకన్ వరకు రక్త చరిత్ర

జరిగిన ప్రచార సభలో ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. వేదికపై ఉన్న స్క్రీన్‌పై చార్ట్‌ను చూసేందుకు ఆయన తల తిప్పిన క్షణంలో, ఒక తూటా ఆయన చెవిని తాకుతూ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆయన వెనుక నిలబడిన ఒక వ్యక్తి మరణించారు. సమీప భవనం నుంచి కాల్పులు జరిపిన దుండగుడిని సీక్రెట్ సర్వీస్ అధికారులు హతమార్చారు. ఈ భద్రతా లోపంపై అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. ఈ ఘటన జరిగిన రెండు నెలలకే, సెప్టెంబర్ 15న ఫ్లోరిడాలోని ట్రంప్ గోల్ఫ్ కోర్స్ సమీపంలోని పొదల్లో రైఫిల్‌తో నక్కి ఉన్న ఒక వ్యక్తిని గుర్తించారు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ కాల్పులు జరపడంతో అతను పారిపోయినా, తర్వాత పట్టుబడ్డాడు. విచారణ అనంతరం కోర్టు అతనికి జీవిత ఖైదు విధించింది. శనివారం ట్రంప్‌పై దాడి జరిగిన హిల్టన్ హోటల్‌కు కూడా ఒక చారిత్రక ప్రాధాన్యం ఉంది.

గత అధ్యక్షులపై దాడుల చరిత్ర
1981 మార్చిలో అప్పటి అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌పై ఇదే హోటల్ బయట హత్యాయత్నం జరిగింది. ఈ దాడిలో ఆయన ఊపిరితిత్తులకు తీవ్ర గాయమైంది. జోడీ ఫోస్టర్ అనే నటిని ఆకట్టుకోవడానికే రీగన్‌ను చంపాలనుకున్నానని నిందితుడు జాన్ హింక్లీ చెప్పడం అప్పట్లో సంచలనం సృష్టించింది. మానసిక స్థితి సరిగా లేదని నిర్ధారణ కావడంతో అతనికి శిక్ష పడలేదు.
అధ్యక్ష పదవిలో ఉండి హత్యకు గురైన వారిలో జాన్ ఎఫ్. కెన్నడీ ఉదంతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 1963 నవంబర్ 22న డల్లాస్‌లో ఓపెన్ కారులో వెళ్తుండగా, లీ హార్వే ఓస్వాల్డ్ అనే వ్యక్తి భవనంపై నుంచి కాల్పులు జరిపి ఆయన్ను హత్య చేశాడు. ఆ తర్వాత ఓస్వాల్డ్‌ను జాక్ రూబీ అనే వ్యక్తి కాల్చి చంపడం జరిగింది. మరో ఐదేళ్లకే కెన్నడీ సోదరుడు రాబర్ట్ కెన్నడీ కూడా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఉండగానే హత్యకు గురయ్యారు.
చరిత్రలో తొలిసారి హత్యకు గురైన అధ్యక్షుడు అబ్రహం లింకన్. బానిసత్వ నిర్మూలన కోసం అంతర్యుద్ధంలో దేశాన్ని నడిపించిన ఆయన, 1865 ఏప్రిల్ 18న వాషింగ్టన్‌లోని ఒక థియేటర్‌లో కాల్పులకు బలయ్యారు. ఆయన తర్వాత జేమ్స్ గార్ఫీల్డ్ (1881), విలియం మెకిన్లీ (1901) కూడా హత్యకు గురయ్యారు. ఇటీవలి కాలంలో 2023 మేలో సాయి వర్షిత్ కందుల అనే భారత సంతతి వ్యక్తి, అధ్యక్షుడు జో బైడెన్‌ను చంపి దేశాన్ని స్వాధీనం చేసుకుంటానని చెబుతూ వైట్‌హౌస్ బారియర్లను ట్రక్కుతో ఢీకొట్టాడు. అతనికి కోర్టు ఎనిమిదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ ఘటనలన్నీ అమెరికా అధ్యక్ష పదవి ఎంతటి ప్రమాదకరమో స్పష్టం చేస్తున్నాయి.

# పల్లెపల్లెకు ఆర్టీసీ బస్సులు నడుపుతాం

డ్రైవర్‌పై దాడి.. స్పందించిన పొన్నం
బస్సు ఆపలేదని నల్గొండ వద్ద డ్రైవర్‌పై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటనపై మంత్రి పొన్నం స్పందించారు. దీనిపై జిల్లా పోలీసు అధికారులతో మాట్లాడి విచారణకు ఆదేశించారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటామన్నారు. డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ప్రతి ఒక్కరూ తమ కుటుంబ వివరాలను ఆన్ లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకుని సహకరించాలి


### ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 26)**
జన గణన -2027 స్వీయ గణన కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ కుటుంబ వివరాలను ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు చేసుకుని సహకరించాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ప్రజలకు సూచించారు. జనగణన -2027 “స్వీయ గణన”లో భాగంగా ఆదివారం ఉదయం ఒంగోలు కలెక్టరేట్ నుండి నిర్వహించిన 5 కె రన్ కార్యక్రమాన్ని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ రావు, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసుతో కలిసి జెండా ఊపి ప్రారంభించి, 5కే రన్‌లో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు మాట్లాడుతూ జనగణన -2027 “స్వీయ గణన”లో భాగంగా రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా 5కె రన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుచున్నదన్నారు. ప్రజల్లో జనగణన పై అవగాహన తీసుకురావడం కోసం ఈ కార్యక్రమాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఎప్పుడూ లేనివిధంగా జనగణన లో స్వీయ గణన విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆన్ లైన్ లో తమ కుటుంబ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. 2011 సంవత్సరం తరువాత 2021 లో జనగణన జరగాల్సి వుండగా, కోవిడ్ కారణంగా వాయిదా పడగా, ఈ సంవత్సరం జనగణన కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారు, సంక్షేమ పథకాల అమలకు ప్రతి ఒక్కరూ తమ కుటుంబ వివరాలను జనగణన కింద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని జనగణన కార్యక్రమానికి సహకరించాలన్నారు. ఈ 5కె రన్ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, ఒంగోలు మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ వెంకటరావు, జనాభా లెక్కల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ 5కె రన్ ఒంగోలు కలెక్టరేట్ నుండి పాత జిల్లా పరిషత్ కార్యాలయం వరకు నిర్వహించారు.









ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

27.04.26    సోమవారం


# ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్న ఆయిల్ కంపెనీలు



అధికారులు కింది స్థాయిలో నిశితంగా పరిశీలించాలి

స్టాకు వివరాలు మాత్రమే సేకరిస్తున్న అధికారగణం

ఇండెంట్ ల వివరాలు సేకరిస్తేనే వాస్తవాలు వెలుగులోకి

మొన్న గ్యాస్, నేడు పెట్రోల్, డీజిల్ కొరత

నేటికీ డీలర్ల సమస్యలు తెలుసుకోని ప్రభుత్వం



**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, ఏప్రిల్ 26)**

ఆయిల్ కంపెనీలు తాము చేస్తున్న తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఆ నిందలను డీలర్ల పై వేయడంతో పాటు ప్రభుత్వాలను కూడా బద్నాం చేయాలని పన్నాగం పన్నినట్లు స్పష్టమవుతోంది. గత నెల రోజుల క్రితం ఏర్పడిన గ్యాస్ కొరత విషయంలోనూ కంపెనీలు వ్యవహరించిన తీరుతోనే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాస్తవాలను పరిశీలించకుండా అధికారులు కూడా గ్యాస్ డీలర్లదే తప్పన్నట్లుగా చెబుతూ వచ్చింది. కానీ వాస్తవంలోకి వెళితే గ్యాస్ సిలిండర్లకు ఓటిపి వ్యవస్థను తీసుకువచ్చి ప్రభుత్వం బ్లాక్ మార్కెట్ కు దాదాపు చెక్ పెట్టింది. అయితే ఇక్కడ గ్యాస్ వినియోగదారుడే మొదటి ముద్దాయి కావడంతో బ్లాక్ మార్కెట్ కు తరలుతున్న గ్యాస్ సిలండర్లను నియంత్రించలేకపోయిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. గత రెండు, మూడు రోజులుగా జిల్లాల ఆయిల్ కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణ చర్యలకు పూనుకుంది. ఈ క్రమంలోనే సివిల్ సప్లయిస్ కమిషనర్‌తో ఆయిల్ కంపెనీలు నిర్వహించిన సమావేశంలో తమ తప్పేమి లేదని, తాము ఆయిల్ సక్రమంగానే సరఫరా చేస్తున్నామని చెప్పి సమావేశాన్ని మమ అనిపించారు. ఆయిల్ కంపెనీలు చెప్పిన మాటలనే కమిషనర్ ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరవేశారు. కానీ వాస్తవాలను పరిశీలించడంలో ఇక్కడ ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం ఘోరంగా వైఫల్యం చెందింది. కేవలం ఆయిల్ కంపెనీలు చెప్పిన మాటలు నమ్మారే తప్ప కింది స్థాయిలో డీలర్లతో ఒక్క సమావేశం నిర్వహించిన దాఖలాలు లేవు. అసలు సమస్య ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు కూడా ప్రభుత్వం ప్రయత్నించలేదు. అధికారులు కూడా పెట్రోలు బంకులను పరిశీలించిన క్రమంలో కేవలం స్టాకు వివరాలు మాత్రమే చూస్తున్నారు. ఉన్న స్టాకు తప్పుదోవ పట్టకుండా జాగ్రత్తగా ప్రజలకు అందించాలని చెబుతుంది. ఇదే క్రమంలో ఉన్న నిల్వలు ఎన్ని రోజులు వస్తాయో అడిగి తెలుసుకుంటున్నారు. అదే విధంగా నూతన లోడ్లు ఎప్పుడు వస్తాయో అడిగి తెలుసుకుంటున్నారు. ఇక్కడ వరకు బాగానే ఉంది. కానీ అసలు సదరు పెట్రోల్ బంకు డీలర్ ఎప్పుడు ఆయిల్ కంపెనీలకు డబ్బులు చెల్లించాడు. ఇండెంట్ ఎప్పుడు పెట్టారు. ఆయిల్ కంపెనీలు ఎప్పటి లోగా పంపాలి.. ఎప్పటికి పంపించారో వంటి వివరాలు సేకరించడంలో అధికారులు కూడా ఒక అడుగు వెనుకనే ఉన్నారు. వాస్తవానికి పెట్రోలు బంకుల్లో పరిశీలించాల్సిన ప్రధమ స్థాయి వివరాలు ఇవే....వీటితో పాటు తక్షణమే ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల డీలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేసి ఆ వివరాలను ప్రభుత్వానికి పంపిస్తే తప్ప ఈ సమస్యకు కొంత పరిష్కారం దొరకదు. కాని ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కాని అధికారులు ఆ దిశగా అడుగులు వేయకుండా ఆయిల్ సరిపడా ఉందని పత్రికా ప్రకటనలు ఇస్తున్నారు. కానీ బంకుల్లో మాత్రం ఆయిల్ దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కింది స్థాయిలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను ఉన్నతాధికారులకు తెలియజేసి ప్రజలకు పెట్రోల్, డీజిల్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పెట్రోల్, డీజిల్ పై ప్రజలు ఆందోళన చెందవద్దు

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఏప్రిల్ 26)**

పెట్రోల్, డీజిల్ పై జిల్లా ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ప్రజలకు తెలిపారు. ఆదివారం ఆమె కనిగిరిలో ప్రత్యేక విలేకరుల సమావేశం నిర్వహించి పెట్రోల్ డీజిల్ కొరత పై వస్తున్న వదంతులను కూలంకషంగా వివరించారు. జిల్లాలో సరిపడా నిల్వలు ఉన్నాయన్నారు. దీని పై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రతి పెట్రోల్ బంకు వద్ద రెవిన్యూ, పోలీసు, పౌర సరఫరా అధికారులను నియమించి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటామన్నారు. ప్రజలు భయాందోళనకు గురై డ్రమ్ములు, క్యాన్లలో పెట్రోలు తీసుకెళ్లవద్దన్నారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత పై వస్తున్న వార్తల నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలో ప్రజల అవసరాలకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, జిల్లాలో ఇంధన కొరత పై వస్తున్న ప్రచారం అవాస్తవమని, అపోహలు నమ్మి వినియోగదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు భయాందోళనకు గురై అవసరమైన దాని కంటే ఎక్కువ ఇంధనాన్ని కొనుగోలు చేయవద్దని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పెట్రోల్ బంకుల్లో బల్క్ కొనుగోలు, అమ్మకాల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, కృత్రిమ కొరతను సృష్టిస్తున్న వారి పై చర్యలు తీసుకునేలా నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించామన్నారు. క్షేత్రస్థాయిలో నిఘా వ్యవస్థను బలోపేతం చేయడం, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పెట్రోల్ బంక్‌ల పై తనిఖీలు చేపట్టడం, అవసరమైతే ప్రత్యేక బృందాలను నియమించడం వంటి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలోని ఇంధన రిటైల్ అవుట్ లైట్లను తనిఖీలు నిర్వహించి, ఎవరి వద్ద అయినా అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ అమ్మకాలు (తరువాయి 4లో...)

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 26)**



త్వరలో మొదటి విడతలో 3792 కుటుంబాలకు టిడ్కో గృహాలు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదగా లబ్ధిదారులకు అందజేస్తామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు అన్నారు. ఒంగోలు నగరంలోని కొప్పోలు పరిధిలో టిడ్కో పనులు పునఃప్రారంభించిన సందర్భంగా అధికారులు, నిర్మాణ సంస్థలతో ఆదివారం కలిసి పరిశీలించడం జరిగింది. జరుగుతున్న పనుల పనితీరు గురించి నిర్మాణ సంస్థలతో మాట్లాడటం జరిగినది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జనార్ధన్‌రావు మాట్లాడుతూ ఒంగోలు నగర పాలక

# త్వరలో మొదటి విడతలో 3792 కుటుంబాలకు టిడ్కో గృహాలు

## ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

సంస్థ పరిధిలోని చింతల, కొప్పోలు ప్రాంతాల్లో పేదల కోసం ఏకంగా 3792 గృహాలను జీప్లస్3 పద్ధతిలో నిర్మిస్తున్నామన్నారు. కొప్పోలు పరిధిలో నిర్మించిన 2736 ఇల్లు 75%, చింతల దగ్గర నిర్మించిన 1392 ఇల్లు 61% గత టీడీపీ ప్రభుత్వంలో పనులు పూర్తి అయ్యాయన్నారు. అయితే సదరు ఏజెన్సీ వారికి ఈ వైసిపి ప్రభుత్వం వచ్చిన నాటి నుండి గడిచిన 5 సంవత్సరాలలో వారికి ఒక్క రూపాయి కూడా నిధులు చెల్లించని కారణంగా మిగతా పనులు పూర్తి కాలేదన్నారు. ఇందులో 300 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న 2,544 గృహాలను లబ్ధిదారులకు కేవలం ఒక్క రూపాయాకే సకల సదుపాయాలతో ఉచితంగా అందిస్తున్నామన్నారు. భూమి విలువతో (తరువాయి 4లో...)

# బాలినేనిని కలిస్తే సస్పెండ్ చేస్తారా

వైసీపీ నుండి సస్పెండ్ అయిన మహిళా నేతలు

బడుగు ఇందిరా, బత్తుల ప్రమీల ఫైర్

మీరు దామచర్ల జనార్ధన్‌కు బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పలేదా

జిల్లాలో వైసీపీలో కుల రాజకీయాలు ముదురుతున్నాయి

మమ్మల్ని సంప్రదించకుండా ఎలా సస్పెండ్ చేస్తారు

త్వరలో ఒంగోలులో 300 మందితో నిరసన ర్యాలీ




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 26)**

కేవలం మాజీ రాష్ట్ర మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసాము అనే నెపంతో మమ్మల్ని పార్టీ నుంచి తొలగిస్తారా, మహిళలంటే గౌరవం లేదా, వైసిపి ఒంగోలు సమన్వయకర్త చుండూరి రవిబాబు, నగర అధ్యక్షులు కటారి శంకర్‌లు ఎమ్మెల్యేలు అయినట్లుగా కలలు కంటూ, పార్టీ కార్యకర్తల పై అనుచితంగా ప్రవర్తించడం ఎంతవరకు సబబు అని వైసిపి నుండి సస్పెండ్ అయిన మాజీ ఒంగోలు (తరువాయి 4లో...)




## ఘనంగా వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు







**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఏప్రిల్ 26)**

మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక పట్టాభి రామస్వామి ఆలయంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు జవ్వాజి విజయ భాస్కరరావు, ప్రధానకార్యదర్శి కసెట్టి వెంకట రవికుమార్‌ల ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అధ్యక్ష, కార్యదర్శులు సంయుక్తంగా వాసవి కన్యకా పరమేశ్వరి దేవతల గురించి వివరించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సఘం అధ్యక్షులు జవ్వాజి విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి వెంకట రవికుమార్, కోశాధికారి చినమనగొండ సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారుడు పోలేపల్లి జనార్ధన్‌రావు, గాదంశెట్టి శేషగిరి రావు, చినమనగొండ శ్రీనివాసరావు, దోగిపర్తి మల్లికార్జునరావు, దోగిపర్తి హరిబాబు, కస్సెట్టి రాము, నేరెళ్ల జనార్ధన్, చెక్క చెన్నకిషోర్, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మార్కాపురం గ్రామీణ పరిధిలో పోలీసుల ముమ్మర తనిఖీలు



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 26)**

మార్కాపురం గ్రామీణ పరిధిలో పోలీసులు ఆదివారం సాయంత్రం ముమ్మర తనిఖీలు చేపట్టారు. గ్రామీణ ఎస్ఐ వేమన ఆధ్వర్యంలో దరిమడుగు సమీపంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పలు వాహనాలను ఆపి పరిశీలించారు. వాహనదారుల లైసెన్స్‌లు, పొల్యూషన్ సర్టిఫికెట్లు తదితర పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కూడా నిర్వహించి, మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై చర్యలు తీసుకునే విషయాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వేమన మాట్లాడుతూ, “వేగం కంటే ప్రాణం మిన్న” అని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పోలీసుల తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## ఘనంగా రంగస్థల కళాకారుడు జ్యోతి ఆంజనేయులు వర్ధంతి



**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఏప్రిల్ 26)**

మండలంలోని మెదరమెట్ల గ్రామంలో ఆదివారం రంగస్థల సీనియర్ కళాకారుడు దివంగత జ్యోతి ఆంజనేయులు నాలుగవ వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన కుమారుడు జ్యోతి రమేష్ బాబు ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌లో ఆయన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన జ్యోతి ఆంజనేయులు విగ్రహానికి పలువురు ప్రముఖులు హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జ్యోతి ఆంజనేయులు రంగస్థలంలో అద్భుతంగా తన నటనతో ప్రజలందరినీ ఆకట్టుకున్నారని చెప్పారు. ఆయన నటన అద్భుతమైనదని కొనియాడారు. మన జిల్లాలోనే రంగస్థలం అనగానే గుర్తు వచ్చేది ఆంజనేయులు అని వారు స్మరించుకున్నారు. ఆయన లేని లోటు రంగస్థలం కళాకారులకు తీరినదని చెప్పారు.

# బాలినేనిని కలిస్తే సస్పెండ్ చేస్తారా



నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు బడుగు ఇందిరా, ఒంగోలు నగర మహిళా అధ్యక్షురాలు బత్తుల ప్రమీల ఫైర్ అయ్యారు. ఒంగోలులోని బడుగు ఇందిరా నివాసంలో ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇందిరా మాట్లాడుతూ వైసీపీలో మహిళలు కేవలం చీరలు కట్టుకొని, ఫోటోలకు ఫోజులు ఇచ్చేందుకే వస్తున్నాడని ప్రతిసారి చుండూరి రవిబాబు అవహేళనగా మాట్లాడటం మమ్మల్ని మరింతగా బాధించిందన్నారు. మహిళలు రాజకీయాలకు పనికిరారా అని ప్రశ్నించారు. కేవలం అగ్రవర్ణాల మహిళలను కారులో ఇంటికి వెళ్లి ఎక్కించుకుని తిప్పే రవిబాబు, బీసీ, ఎస్సీ మహిళల పట్ల వివక్ష చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ రాష్ట్ర మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైసీపీలో ఉన్నంతకాలం తమకు ఎంతో ఆదరణ ఉండేదన్నారు. అన్ని రకాల సహాయ సహకారాలు అందించేవారన్నారు. ఆయనపై ఉన్న అభిమానంతో మేము బాలినేనిని కలిశానే తప్ప, జగన్ అంటే తమకు ఎంతో ఇష్టమని, జగన్ కోసమే వైసీపీలో ఉన్నామని పేర్కొన్నారు. కనీసం తమతో సంప్రదించకుండా తమరు పార్టీ నుండి ఎలా సస్పెండ్ చేస్తారని ప్రశ్నించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ఒంగోలు ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు చుండూరి రవిబాబు బొకే తీసుకుపోయి శుభాకాంక్షలు చెప్పలేదా అని ప్రశ్నించారు. రవిబాబు బియ్యం వ్యాపారాన్ని టిడిపి నాయకుల అండ దండలతో చేయటం లేదా అన్నారు. అలాంటప్పుడు ఆయన్ని పార్టీ నుండి ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. సంత నూతనపాడు కి చెందిన దుంప చెంచిరెడ్డి, బాలినేని కలవడం లేదా అని ప్రశ్నించారు. మరి ఆయన్ని ఎందుకు పార్టీ నుండి సస్పెండ్ చేయలేదన్నారు. కమ్మ కులస్తులు అందరూ వైసీపీలో ఉన్నట్లు చుండూరి రవి బాబు కలలు కంటున్నారు. వెంటనే తమపై ఉన్న సస్పెన్షన్ ను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో 300 మందితో ఒంగోలులో భారీ నిరసన ర్యాలీ నిర్వహించి, మీ గుట్టంతా బయట పెడతామని హెచ్చరించారు. బత్తుల ప్రమీల మాట్లాడుతూ బాలినేని శ్రీనివాస్ రెడ్డి తమకు ఎంతో సహాయ సహకారాలు అందించారు అన్నారు. అటువంటి వ్యక్తిని కలవడం తప్పా అన్నారు. మా డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ సన్మానం చేస్తుంటే ఆ కార్యక్రమానికి హాజరయ్యానని, అది తప్పా అని ప్రశ్నించారు. చుండూరి రవి బాబు, కటారి శంకర్ చరిత్ర అంతా మాకు తెలుసు అన్నారు. వెంటనే పార్టీలోకి తీసుకోవాలని, లేనిపక్షంలో వారి చరిత్ర అంతా బట్టబయలు చేస్తామని హెచ్చరించారు.

# త్వరలో మొదటి విడతలో 3792 కుటుంబాలకు టిడ్కో గృహాలు







పాటు ఇంటి విలువ రూ.6.55 లక్షలను ప్రభుత్వమే భరిస్తోంది. 365 చ.అ. (624ఇల్లు), 430 చ.అ. ఇంటికి (960 ఇల్లు త్వరలో పూర్తి చేస్తాం. గత వైసీపీ ప్రభుత్వం లో చేసిన పనులను పూర్తి చేయకుండా మొదటి దశ లో వున్న 1892 గృహలను రద్దు చేసారు. మొదటి విడతలో 3792 గృహలను పూర్తి చేసినా వైసీపీ ప్రభుత్వంలో రద్దు చేసిన గృహలను కూడా ముఖ్యమంత్రి గారితో మాట్లాడి ఈ గృహలను కూడా మంజూరు చేపించి లబ్ధిదారులకు అందజేస్తాం అన్ని తెలియజేసారు. గత 2022 - 2023 ఆర్థిక సంవత్సరంలో ఈ వైస్సార్ సిపి ప్రభుత్వం 479 మంది లబ్ధిదారుల పేరిట బ్యాంకు నుండి 7.74 కోట్ల రూపాయలు రుణాలు తీసుకున్నారు. వైసిపి ప్రభుత్వం లబ్ది దారులకు ఇల్లు ఇవ్వకుండానే వారి పేరిట బ్యాంకు లు ద్వారా లోన్లు తీసుకొని ఆ అమౌంట్ మొత్తాన్ని లబ్ధిదారుని అకౌంట్ నుండి ప్రభుత్వం బదలాయించుకొని ప్రతి నెల లబ్ది దారులు చేత బలవంతంగా ఇఎంఐ లు కట్టిస్తున్నారు. లబ్ధిదారులు ఇది అన్యాయమని ప్రశ్నిస్తే వారికి లీగల్ నోటీసు లు ఇప్పించి బెదిరించిన పరిస్థితి మనం అందరం చూసాం. ఈరోజు మొత్తం కూడా కూటమి ప్రభుత్వం చెల్లించి పూర్తిగా లబ్ధిదారులు భారం లేకుండా చేసినది అన్ని తెలిపారు. ఆగిపోయిన పనులను కూటమి ప్రభుత్వం వచ్చాకా 40 కోట్ల రూపాయలతో టెండర్లను పిలిచి పనులు తిరిగి ప్రారంభించడం జరిగినది. ఇప్పటికే కాంట్రాక్టర్లు జంగిల్ క్లీనింగ్, ఫ్లాట్స్ క్లీనింగ్, అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్లు పనులు మొదలుపెట్టారన్నారు. అతి త్వరలో పూర్తి చేసి ఈ ఇళ్లను పేదలకు దసరా పండుగకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడ్కో ఈఈ రఫీ, కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, ఏఎంసి చైర్మన్ వెంకట్రావు, నగర అధ్యక్షులు బండారు మదన్, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ పై ప్రజలు ఆందోళన చెందవద్దు



గుర్తిస్తే అటువంటి వారిపై వెంటనే కేసులు బుక్ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రజలు అపోహలకు లోనవకుండా అధికారిక సమాచారం మేరకు మాత్రమే విశ్వసించాలని, ఇంధన సరఫరా సాధారణంగా కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. దీని పై ముఖ్యమంత్రి, సంబంధిత పౌరసరఫరాల శాఖ మంత్రి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు వివరించారు. అనంతరం కనిగిరిలో ఓ పెట్రోల్ బంక్ ను పరిశీలించి స్టాక్ వివరాలను అక్కడ ఉన్న సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డిఓ శివరామిరెడ్డి, ఇతర సిబ్బంది ఉన్నారు.





## ఘనంగా టైటానిక్ ఎగ్జిబిషన్ ప్రారంభం

### ఎగ్జిబిషను ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)**

ఒంగోలులోని కొత్త కూరగాయల మార్కెట్ సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన టైటానిక్ ఎగ్జిబిషన్, శ్రీలక్ష్మి కల్చరల్ ఎగ్జిబిషన్‌ను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు కుటుంబ సభ్యులు ఆటవిడుపు కోసం సాయంత్రం వేళల్లో ఎగ్జిబిషన్కు వచ్చి వినోదాన్ని పొందాలని కోరారు. ఎగ్జిబిషన్లోని పలు రాష్ట్రాలకు చెందిన వస్తువులను ప్రజలు కొనుగోలు చేయాలన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు మద్దులూరి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ఒంగోలు లో టైటానిక్ మ్యూజియం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది అన్నారు. అలాగే పిల్లల ఆటవిడుపు కోసం కరెంట్ ద్వారా, జయంట్ విల్, బ్రేక్ డాన్స్, కొలంబస్, వివిధ రకాలైన రెడీమేడ్ జ్యువెలరీతో పాటుగా, పలు రాష్ట్రాలకు చెందిన ఆట వస్తువులు, ఇంటి గృహపకరణాలు ప్రజలకు అనువైన ధరలో ఎగ్జిబిషన్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని ఒంగోలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఈదుపల్లి శివ, పలువురు టిడిపి నేతలు గుంటూరు రాంబాబు, ఆర్ల వెంకటరత్నం, తూము సుబ్బారావు, పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి

## తహశీల్దార్ షేక్ నాగూర్ మీరావలి



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఏప్రిల్ 26)**

మండలంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని మండల తహశీల్దార్ షేక్ నాగూర్ మీరావలి స్పష్టం చేశారు. మండల పరిధి లోని హనుమంతునిపాడు మరియు వేములపాడు లోని పెట్రోల్ బంకులను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. మండలం లోని ప్రజలకు అవసరమైన మేరకు ఇంధన సరఫరా నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో డీజిల్ కొరతపై వస్తున్న ప్రచారం నేపథ్యంలో ప్రజలు భయాందోళనలకు లోనవుతూ పెట్రోల్ బంకుల వద్ద అధిక సంఖ్యలో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. అవసరం లేకపోయినా పెట్రోల్, డీజిల్‌ను నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించడం వల్ల అనవసర రద్దీ ఏర్పడుతోందని చెప్పారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా, సాధారణ అవసరాలకు మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని సూచించారు. పెట్రోల్ బంకుల్లో సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. ఇంధన కొరతపై వస్తున్న వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

# పులిపిట్ పైనే అందరి దృష్టి
# రెండు వర్గాలుగా విడిపోయి వాగ్వివాదం

## జేఎంబి చర్చి వద్ద భారీగా మోహరించిన పోలీసులు
## కోర్టు ఆదేశాలను అమలు చేయాలని ఒక వర్గం, కమిటీ నిర్ణయం ఫైనల్ అంటూ మరో వర్గం వాదోపవాదాలు










(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)
కేవలం పులి పీట్ పై నిలబడి ప్రార్థనలు నిర్వహించాలనే లక్ష్యంగా ఒకరిని ఒకరు అడ్డుకుంటూ ఒంగోలులోని జేఎంబి చర్చిలో ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గత తొమ్మిది సంవత్సరాలుగా జె ఎంపీ చర్చిలో పాస్టర్ల వివాదం కొనసాగుతూనే ఉంది. పాస్టర్ ఆగస్టీన్ ఒక వర్గంగా, పాస్టర్ జాన్ కెనడి మరో వర్గంగా విడిపోయి కోర్టులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం జిల్లా కోర్టు పాస్టర్ ఆగస్టీన్ పులిపీట్ ఎక్కి ప్రార్థనలు నిర్వహించేందుకు అనుమతులు ఇచ్చారు. అయితే దీనికి జాన్ కెనడి వర్గం అనుమతించలేదు. చర్చి పాలకవర్గం అనుమతులు తప్పనిసరి అని, 60 సంవత్సరాలు నిండిన పాస్టర్లు పులిపీట్ ఎక్కే అర్హత లేదని తమ వాదన వినిపిస్తున్నారు. ఈనెపద్యంలో ఆదివారం జె ఎం బి చర్చ్ లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆదివారం తమను చర్చ్ లోకి వెళ్లనివ్వాలని పాస్టర్ అగస్టిన్, ఆయన మద్దతు దారులు పోలీసులను కోరారు. కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని వాళ్ళ పోలీసులను డిమాండ్ చేశారు. దీంతో కొంతమేర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఓబులేసు పాల్గొని అగస్టిన్ వర్గం వాదనలు విన్నారు. దీంతో పులిపీట్ పై తిరిగి ప్రతి స్తంభన నెలకొంది.

## శిధిలమైన బంగ్లా కూల్చి వేత పై ప్రజలు హర్షం



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 26)
వినుకొండ పట్టణం నరసరావుపేట రోడ్డు చీఫ్రా కాలనీ సాయిబాబా గుడి వద్ద శిథిలావస్థలో ఉన్న చీఫ్రా బంగ్లాను అధికారుల ఆదేశాలతో కూల్చివేయటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బంగ్లా శిథిలావస్థకు చేరి పదేళ్లపై గడుస్తున్న కూల్చివేయకపోవడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దేవాలయం, ఎన్ఎస్పి కార్యాలయం వద్దకు నిత్యం ప్రజలు వస్తూ ఉంటారు. అంతేకాకుండా వాకింగ్ ట్రాక్ ఉండటం వలన ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వందలాది మంది వాకర్స్ ఇక్కడ వాకింగ్ చేస్తుంటారు. శిధిలమైన బంగ్లా ఎప్పుడు కూలి ప్రమాదం జరుగుతుందోనని వాకర్స్ ఆందోళన చెందేవారు. శిధిలమైన బంగ్లాను కూల్చివేయమని అనేకసార్లు ప్రజలు ఎన్ఎస్పి అధికారులను కూడా కోరారు. నేటికీ స్పందించి అధికారులు శిథిలమైన బంగ్లాను కూల్చి వేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు గారి సహకారంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఇక్కడ లైబ్రరీ, వాకింగ్ ట్రాక్, వ్యాయామశాల అందుబాటులోకి వస్తాయని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఎస్పి స్థలంలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని ప్రజలు

## సింగరాయకొండ సీఐగా వై శ్రీహరి బాధ్యతలు స్వీకారం




(షణ్ముఖ వెలుగు, కొండపి, ఏప్రిల్ 26)
ప్రకాశం జిల్లా సింగరాయకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వై శ్రీహరి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన సీఐని చీరాలకు బదిలీ అయ్యారు. గుంటూరు ఎస్‌బీ 3 లో సీఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీహరిని సింగరాయకొండకు నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సర్కిల్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది నూతన సీఐకు శు భాకాంక్షలు తెలిపారు.

**కొండపి సిఐగా రమణయ్య బాధ్యతల స్వీకరణ**

కొండపి సిఐగా రమణయ్య ఆదివారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పూల బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అసాంఘీక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన సిఐలు**

రాష్ట్ర సాంఘీక, సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని కొండపి, సింగరాయకొండ సిఐలు రమణయ్య, వై శ్రీహరిలు ఆదివారం ఉదయం తమ తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం తూర్పునాయుడు పాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి స్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పూల కుండీ అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.






# జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి



### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 26)
జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఏజెన్సీ లు, సరఫరాదారులు కృత్రిమ సృష్టిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత పై వస్తున్న వార్తల నేపథ్యంలో ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జిల్లా ఎస్పి వి హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, సంబంధిత శాఖల అధికారులు, ఆయిల్ కంపెనీల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పెట్రోల్, డీజిల్ వినియోగం, సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల అవసరాలకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, జిల్లాలో ఇంధన కొరత పై వస్తున్న ప్రచారం అవాస్తవమని, అపోహలు నమ్మి వినియోగదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు భయాందళనకు గురై అవసరమైన దాని కంటే ఎక్కువ ఇంధనాన్ని కొనుగోలు చేయవద్దని ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పెట్రోల్ బంకులపై అలాగే బల్క్ కొనుగోలు, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, కృత్రిమ కొరతను సృష్టిస్తున్న వారి పై చర్యలు తీసుకునేలా నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిఘా వ్యవస్థను బలోపేతం చేయడం, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పెట్రోల్ బంక్‌లపై తనిఖీలు చేపట్టడం, అవసరమైతే ప్రత్యేక బృందాలను నియమించడం వంటి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా లోని ఇంధన రిటైల్ అవుట్ లైట్లను తనిఖీ లు నిర్వహించి, ఎవరి వద్ద అయినా అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ అమ్మకాలు గుర్తిస్తే అటువంటి వారిపై వెంటనే కేసులు బుక్ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. అలాగే, జిల్లాలో పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేస్తూ, అసత్య ప్రచారాలతో ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అపోహలకు లోనవకుండా అధికారిక సమాచారం మేరకు మాత్రమే విశ్వసించాలని, ఇంధన సరఫరా సాధారణంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## ఘనంగా శ్రీ నగరేశ్వర, నవగ్రహ విగ్రహాల పునః ప్రతిష్టా మహోత్సవం




(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 26)
పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ నందు వేంచేసియున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అమ్మవారి జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకొని, దేవస్థాన ఉపశాలనందు శ్రీ నగరేశ్వర, మృత్యుంజయ సహిత ఆదిత్యాది నవగ్రహ విగ్రహాల పునః ప్రతిష్టా కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం గంవ 11:29 నిమిషాలకు శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సదావర్తి సంఘం అధ్యక్షులు జొన్నలగడ్డ చంద్రశేఖర గుప్త (బాబ్జి) మాట్లాడుతూ ముందుగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహ ప్రతిష్టను చేశారు. ఈ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ వినుకొండ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ముఖ్య అతిధిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు భారీగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఏఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ గౌరవ అధ్యక్షులు పెండాల శ్రీనివాసరావు, తాత వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు పెరుమళ్ళ అమర్నాథ్, రెడ్డి నగేష్ బాబు, కోశాధికారి పెండాల సురేష్ బాబు, కొల్లిపర వెంకట నాగేశ్వరరావు మరియు పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.





## ఉలవపాడులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వర అమ్మవారి ఊరేగింపు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 26)
శ్రీ వాసవి కన్యకా పరమేశ్వర అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఉలవపాడులోని అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో



ఉలవపాడు ఆర్యవైశ్య సోదరిమణులు కోలాటం ఆడుతూ అమ్మవారి ఊరేగింపు గ్రామ వీధుల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమం బాబనపల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగింది. ఈ వేడుకల్లో పొన్నూరు రామాంజనేయులు, తూనుగుంట్ల దివ్యనందగుప్త, వాయిచర్ల బ్రదర్స్, పచ్చిపులుసు బ్రదర్స్, వక్కలగడ్డ మణికంఠ, పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

ఒంగోలులోని గద్దలగుంటలో రిటైర్డ్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గద్దలగుంట ఓరియంటేషన్ స్కూల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. రిటైర్డ్ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను అభినందించారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, టీడీపీ నగర అధ్యక్షుడు బండారు మదన్, గద్దలగుంట రిటైర్డ్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు తోట రంగస్వామి, కొల్లా హనుమంతరావు, రాజేంద్రప్రసాద్, రవికుమార్, వెంకటేశ్వర్లు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాప్టో రిలే నిరాహార దీక్షలో మార్కాపురం జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి పిచ్చయ్య



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఏప్రిల్ 26)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు మార్కాపురం జిల్లా నుంచి జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి పిచ్చయ్య హాజరయ్యారు. ప్రభుత్వం వెంటనే పిఆర్సి కమిషన్ నియమించి, ఐఆర్‌ను ప్రకటించాలని, పెండింగ్లో ఉన్న డిఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, సరెండర్ లీవ్ ఎన్కాష్ డబ్బులను వెంటనే చెల్లింపచాలని ప్రభుత్వాన్ని కోరడమైనది. ఈ కార్యక్రమానికి గిద్దలూరు నుంచి మస్తాన్,హకీమ్ తదితరులు హాజరయ్యారు.

# ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయులకు తక్షణమే 12వ పిఆర్సి కమిషన్ వేయాలి

## యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్ముజు






(షణ్ముఖ వెలుగు, విజయవాడ, ఏప్రిల్ 26)

ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపుమేరకు విజయవాడ అలంకార్ సెంటర్లోని రెండవ రోజు నిరాహార దీక్ష లో ప్రకాశం జిల్లా నుండి యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్ముజు శ్రీనివాసరావు, ప్రకాశం జిల్లా ఫ్యాప్టో డిప్యూటీ సెక్రెటరీ జనరల్ షేక్ అబ్దుల్ హై యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు రిలే నిరాహార దీక్షలో పాల్గొనడం జరిగినది కొమ్మొజు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు ఉపాధ్యాయులకు తక్షణమే 12వ పిఆర్సి కమిషన్ వేయాలని 82 నెలల డిఏ బకాయిలు చెల్లించాలని సరేందర్ లీవ్ బకాయులు చెల్లించాలని, సిపిఎస్ ఎంప్లాయిస్ కి చెల్లించాల్సిన 90 శాతం డిఏ తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేసారు. ప్రకాశం జిల్లా ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ అబ్దుల్ హై మెమో నంబర్ 57 ను వెంటనే అమలు చేయాలని, గతంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేము అధికారంలో వచ్చిన వెంటనే ఒక సంవత్సరంలోపు సిపిఎస్ ఉద్యోగులకు ఒక మంచి పెన్షన్ పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి నేడు సుమారు 20 నెలలు కావస్తున్న సిపిఎస్ మీద ఎలాంటి కమిటీ గాని లేదా కమిషన్ గాని వేయకుండా గత ప్రభుత్వం మాదిరి ఈ ప్రభుత్వం కూడా మీనా మేషాలు లెక్కిస్తుందని ఒకవేళ సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించకపోతే మరో బి ఆర్ టీఎస్ ఉద్యమ ము తయారవుతుందని హెచ్చరిక జారీ చేశారు సిపిఎస్ ఉద్యోగులకు డిఏ అరియర్స్ బిల్లు పెట్టుకోవడానికి అవకాశం కల్పించాలని, పెండ్లి ప్రభుత్వం అంటూనే ఉద్యోగులకు పిఆర్సి కమిషన్ వేయ కుండా సుమారు 35 నెలలు దాటిందని గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా ఏమీ లేదని, ఎలక్షన్ ముందు ఒక మాట అధి కారంలో వచ్చిన తర్వాత ఇచ్చిన మాట నిల పెట్టుకోవడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రకాశం జిల్లా నుండి ఫ్యాప్టో నిరాహార దీక్షలో జిల్లా అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, మార్కాపురం జిల్లా అధ్యక్షులు షేక్ ఖజా రహమతుల్లా, జిల్లా కార్యదర్శులు పాలపర్తి రామాంజనేయులు, ఎం పిచ్చయ్య, సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి, గోగుల కోటేశ్వరరావు, పి ఖాసిం, టి రమణారెడ్డి, పట్నం నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో పెట్రోలు, డీజిల్ కొరత లేదు

### బంకు యజమానులు కృత్రిమ కొరత సృష్టించవద్దు
### తహశీల్దార్ ఎం వి కృష్ణారెడ్డి





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 26)

మండలంలో పెట్రోలు, డీజిల్ కొరత లేదని, పెట్రోలు బంకు యజమానులు కృత్రిమ కొరత సృష్టించవద్దని తహసీల్దార్ ఎంవి క్రిష్టారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పెట్రోల్ బంకులను ఆయన తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. పట్టణంలో మొత్తం 8 పెట్రోల్ బంకులు ఉన్నయన్నారు. వాటిలో ఒకటి పూర్తిగా మూతపడిందన్నారు. మిగిలిన 7 బంకుల్లో రెండింటిలో మాత్రమే స్టాకు లేదని గుర్తించామన్నారు. మిగిలిన 5 బంకుల్లో పూర్తి స్థాయిలో పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నట్లు గుర్తించామన్నారు. కనుక ఆయిల్ బంకు యజమానులు స్టాకు ఉంచుకొని లేదని చెప్పడం, బంకులో అమ్మకుండా బైట ప్రదేశాల్లో అమ్మకాలు జరపడం చేయరాదని సూచించారు. అలా చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలు ఏమైన జరిగినట్లు ఎవరి దృష్టికి అయినా వచ్చినట్లైతే జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 7013308642కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. అయితే అయిల్ కంపెనీల నుండి పూర్తిస్థాయిలో సరఫరా జరగడం లేదని బంక్ యజమానులు అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. ఏది ఏమైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి ఇండెంట్లను పరిశీలిస్తే కొరత ఎవరు సృష్టిస్తున్నారో తెలుస్తుందని వినియోగదారుల రక్షణ సమితి అధ్యక్షుడు దర్శి రామారావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహారావు, విఆర్వోలు సుబ్బారావు, సురేష్, తదతరులు ఉన్నారు.

## పర్చూరులో నేడు ప్రజా దర్బార్

### హాజరుకానున్న కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే ఏలూరి, జిల్లా యంత్రాంగం


(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఏప్రిల్ 26)

పర్చూరు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమం ఈ నెల 27 న (సోమవారం) నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సారథ్యంలో జిల్లా యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. పట్టణంలోని కొల్లా వెంకటనారాయణ, తులశమ్మ కళ్యాణ మండపంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దర్బార్ జరుగుతుంది. కార్యక్రమం కోసం జిల్లా అధికార యంత్రాంగం కళ్యాణ మండపంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వివిధ శాఖల అధికారులు హాజరై ప్రజల ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు. నియోజకవర్గానికి చెందిన ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వినతులను నేరుగా కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా పెన్షన్లు, రేషన్ కార్డులు, రెవెన్యూ భూ సమస్యలు, ఇళ్ల స్థలాలు, గృహాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలపై వినతి పత్రాలు అందజేయవచ్చని పేర్కొన్నారు. దర్బార్‌కు హాజరయ్యే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రకటన విడుదల చేసింది.

## ఆగిన ఆయిల్ క్యూ లైన్‌లో భారీగా నిలిచిన వాహనాలు


### పెట్రోల్ డీజిల్ కొరతతో అల్లాడుతున్న వాహనదారులు
### జిల్లా వ్యాప్తంగా చాలా పెట్రోల్ బంకులలో నోస్టాకు బోర్డులు
### పెట్రోల్ కొంతమేర దొరుకుతుండగా, డీజిల్ మాత్రం పూర్తి స్థాయిలో నిలుపుదల




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

ఇరాన్, అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం ప్రభావం జిల్లాను తాకింది. యుద్ధం ప్రభావంతో జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత నెలకొంది. యుద్ధం ప్రారంభం నుండే కొన్ని పెట్రోల్ బంకులు మూసివేయగా, ఎక్కువ భాగం పెట్రోల్ బంకులు శనివారం మధ్యాహ్నం నుండి మూసి వేయడం జరిగింది. ప్రతి చోటా నోస్టాకు బోర్డులు వెలిశాయి. దీంతో వాహనదారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఆటోవాలాలు బండిలో డీజిల్ లేక ఇంటి వద్దనే ఉంచేసుకున్నారు. మోటార్ బైక్ వాహనదారులు మాత్రం పెట్రోల్ కోసం ఊరు మొత్తం గాలిస్తున్నారు. దొరికిన చోట కూడా భారీగా క్యూ లైన్లు ఉన్నాయి. పెట్రోల్ బంకు నిర్వాహకులు వాహనదారులకు ఒక్కొక్క లీటర్ మాత్రమే పెట్రోలను కొడుతున్నారు. దీంతో ప్రజలకు అన్ని రకాల పనులకు ఆటంకం కలుగుతుంది. పెట్రోల్ కష్టాలు ఎప్పుడు తీరుతాయో సమాచారం చెప్పే నాధుడు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. డీజిల్ లేక చాలా వాహనాలు ఎక్కడికక్కడ రోడ్లపై నిలిచిపోయాయి. ఇది ఇలాగే కొనసాగితే మరో ఒకటి రెండు రోజుల్లో నిత్యవసర వస్తువుల ధరలపై ఈ ప్రభావం పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కలుగజేసుకొని ఆయిల్ కష్టాలు తీర్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజల నుండి ఒత్తిడి పెరుగుతుంది.




# వైభవంగా వాసవి అమ్మవారి జయంతి ఉత్సవాలు





(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, ఏప్రిల్ 26)

## శిద్దా లక్ష్మి పద్మావతి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు
## 102 కళశాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించిన వాసవి మహిళలు
## అంగరంగ వైభవంగా అమ్మవారి నగరోత్సవం



చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. 102 కలశాలతో ఆర్యవైశ్య మహిళలు ప్రదక్షిణ పూర్వకంగా శ్రీ హరిహర క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ వాసవి అమ్మవారికి సామూహిక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వెంకట హరి కుమారాచార్యులు, సుబ్రమణ్య శర్మ, హరికృష్ణ శర్మ ఆధ్వర్యంలో శ్రీ వాసవి అమ్మవారికి గంగా జలం, పంచామృత,సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వాసవి అమ్మవారి అలంకరణ అత్యంత సుందర్భంగా నిర్వహించారు. అమ్మవారి దేదీప్యమైన సుందర రూప దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. సాక్ష్యాత్తు పెనుగొండ శ్రీ వాసవి అమ్మవారి దివ్య మంగళ దర్శన భాగ్యం అనుభూతి కలిగించే విధంగా అమ్మవారి అలంకరణ అందరిని ఆకట్టుకుంది. అమ్మవారి జయంతి సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు దంపతుల అల్లుడు మన్యం ఫణికుమార్, మన్యం వెంకట సునీత దంపతులు అమ్మవారికి 102 ఆర్యవైశ్య గోత్రాలు పేర్లు పొదిగిన రజిత హారం అమ్మవారికి సమర్పించారు. చీమకుర్తికి చెందిన కొత్త మాసు సుధాకర్ దంపతులు ఇత్తడి లోహంతో చేసిన కల్ప వృక్షం, దీప కుందులు, అష్ట లక్ష్మి కలశం సమర్పించారు. చీమకుర్తి ఆర్యవైశ్య మహిళలచే సామూహిక శ్రీ లలితా సహస్రనామ పారాయణం, శ్రీ హనుమాన్ చాలిశా, సంకీర్తనలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా శిద్దా లక్ష్మి పద్మావతి వాసవి మహిళలతో కలసి క్షేత్రంలో వేంచేసి ఉన్న సకల దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి కుంకుమ పూజ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళ లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. వాసవి అమ్మవారి జయంతి కార్యక్రమానికి విచ్చేసిన సువాసీనులకు లక్ష్మి పద్మావతి పసుపు, కుంకుమ, తాంబూలం అందచేశారు.

అంగరంగ వైభవంగా అమ్మవారి నగరోత్సవం...

ఆదివారం రాత్రి వాసవి మహిళా భక్తులు, చీమకుర్తి ఆర్యవైశ్య యూత్ ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం కన్నులపండువగా సాగింది. శ్రీ హరిహర క్షేత్రం నుండి సాగిన అమ్మవారి నగరోత్సవం చీమకుర్తి పుర వీధుల్లో జరిగింది. అమ్మవారి నగరోత్సవంలో మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శిద్దా వెంకటేశ్వర్లు, శిద్దా పాండురంగారావు దంపతులు, వారి కుటుంబ సభ్యులు, శిద్దా పెద్దబాబు దంపతులు, శిద్దా సాయిబాబు, శిద్దా సుధాకర్ దంపతులు,శిద్దా బాలాజీ దంపతులు, శిద్దా సురేష్ దంపతులు, శిద్దా వారి కుటుంబ సభ్యులు శిద్దా జయశ్రీ, శిద్దా పుష్పలత, శిద్దా జయ భారతి, పల్లపోతు పద్మ, ఆర్యవైశ్య మహిళ అధ్యక్షురాలు సువర్ణ, ఏ అరుణ వాసవి యూత్ సభ్యులు, గ్రానైట్ వ్యాపార వేత్త నూనె సుబ్రహ్మణ్యం, నూనె హేమంత్, మద్ది వెంకట్రావు, కూరపాటి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు దంపతులు ఆధ్వర్యంలో శిద్దా ట్రస్ట్ ద్వారా భక్తులకు ఉచిత బస్, అన్న ప్రసాదాలు అందచేశారు.

# గిద్దలూరులో పోలీస్ సంక్షేమ పెట్రోల్ బంక్‌కు భూమి పూజ



## భూమి పూజ నిర్వహించిన జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఏప్రిల్ 26)

మార్కాపురం జిల్లా పోలీస్ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గిద్దలూరులో ఏర్పాటు చేయనున్న నూతన పెట్రోల్ బంక్ నిర్మాణానికి సంబంధించి భూమి పూజ కార్యక్రమం అదివారం జరిగింది. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కొత్తగా మార్కాపురం జిల్లా ఏర్పడిన అనంతరం పోలీస్ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పెట్రోల్ బంకును ఏర్పాటు చేయడం జరిగిందని, పోలీస్ వెల్ఫేర్ నిమిత్తం ఈ జిల్లాకు అవసరమైన సదుపాయాలను సమకూర్చేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలకు నాణ్యమైన ఇంధనాన్ని అందించాలనే లక్ష్యంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఈ పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇది కేవలం పోలీస్ సిబ్బందికే కాకుండా, సాధారణ ప్రజలకు కూడా అందుబాటులో ఉండి, నాణ్యమైన ఇంధనాన్ని అందించనుంది. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం ఒక స్ఫూర్తిదాయకమైన కార్యక్రమమని పేర్కొన్నారు. ఈ బంక్ ప్రారంభంతో పోలీస్ వాహనాలకు ఇంధనం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, సమయం ఆదా అవుతుందని, తద్వారా విధుల్లో మరింత సమర్థత పెరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం పోలీస్ వాహనాలు ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం సేవలందిస్తున్న నేపథ్యంలో, ఇంధనం అత్యవసర అవసరమన్నారు. ఈ కొత్త బంక్ ఏర్పాటుతో పోలీస్ వాహనాలకు సకాలంలో ఇంధనం అందుబాటులో ఉండి, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ బంక్ ప్రారంభానికి కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించారు. నిర్మాణ పనులు సకాలంలో, నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. ఈ పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సహకరించిన ప్రభుత్వ శాఖలు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, సంబంధిత అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఈ పోలీస్ పెట్రోల్ బంక్ ప్రజలకు అందుబాటులోకి రానుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు, గిద్దలూరు టౌన్ సీఐ సురేష్, గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, కంభం సీఐ మల్లికార్జునరావు, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఎస్ఐలు, ఎఆర్ ఎస్ఐ తిరుపతిస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.



# మాటిచ్చిన పని వెంటనే పూర్తి చేసిన ఎమ్మెల్యే సాంబన్న

# ఫోన్ వినతికి స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి

## రూ.70 లక్షలతో రోడ్డు నిర్మాణం
## రోడ్డు ప్రారంభోత్సవంలో ఆనందం వ్యక్తం చేసిన కాలనీవాసులు





(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఏప్రిల్ 26)

ప్రజల సమస్యలపై తక్షణ స్పందనతో మాటిచ్చిన పనిని చేసి చూపించిన నాయకత్వానికి మరోసారి నిదర్శనంగా నిలిచారు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు (సాంబన్న). ఫోన్ ద్వారా వచ్చిన వినతి పత్రానికి వెంటనే స్పందించి, రూ.70 లక్షల నిధులను మంజూరు చేసి రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ రోడ్డు పనులు పూర్తికావడంతో, ఈరోజు ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. రోడ్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయనకు కాలనీవాసులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. బాణాసంచా కాలుస్తూ, “జై ఏలూరి” అంటూ నినాదాలు చేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి...

చిన్న వినతి అయినా పెద్దదిగా భావించి వెంటనే స్పందించి పరిష్కారం చూపడం ఎమ్మెల్యే సాంబన్న ప్రత్యేకతగా నిలుస్తోంది. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ చిత్తశుద్ధితో పనిచేయడం ఆయన నాయకత్వానికి నిదర్శనమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

అభివృద్ధే లక్ష్యం...

ప్రాంత అభివృద్ధి, ప్రజల సౌకర్యాలే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే సాంబన్న తెలిపారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా రహదారులు, తాగునీరు వంటి అంశాలపై నిరంతరం దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే సాంబన్నకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోయపాటి సాంబయ్య , బత్తుల రాము, ఈదల రవి,ఈదల అనిల్, బత్తుల కృష్ణవేణి, గన్నమనేని ప్రభాకర్‌రావు, సొసైటీ ప్రెసిడెంట్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు, గంధం కనకరాజు, కోడి రెక్క బాబు, గంధం ఏసోబు, తెలగతోటి సిలువరాజు, మేక జకరయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బడుగు కోటయ్యను పరామర్శించారు.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 26)

వాసవి క్లబ్స్ వినుకొండ వారి ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల కుల దైవం ఒక మాత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా స్థానిక పట్టణంలోని రంగనాయక స్వామి వారి దేవస్థానం వద్ద నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు జల కలశాలతోమరియు శ్రీ వాసవి అమ్మవారి వెండి విగ్రహం పల్లకి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా రంగనాయక స్వామివారి దేవస్థానం వద్ద నుంచి జపూజలు నిర్వహించి వాసవి క్లబ్స్ సభ్యులు పనితా క్లబ్, యూత్ క్లబ్ పట్టణ ప్రముఖులు ఆర్య వైశ్యులు పెద్ద సంఖ్యలో తరలిరాగా మహిళలు కలశాలతో విచ్చేసి ఊరేగింపులో పాల్గొని వాసవి అమ్మవారి కి హారతులు అందజేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షులు కాసుల వెంకట రవీంద్ర మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కుల దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఘనంగా నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆ వాసవి అమ్మవారు చూపించిన మార్గంలో మనందరం నడవాలని అందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని అదేవిధంగా వాసవి క్లబ్ అధ్యక్షుడిగా ఇలాంటి మంచి అమ్మవారి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలియజేశారు. వాసవి అమ్మ వారి జయంతి సందర్భంగా పట్టణంలోని మెయిన్ బజార్ మొత్తాన్ని సరదాగా సుందరంగా వాసవి మాత తోరణాలతో అరటి మండపాలతో సుందరంగా అలంకరించారు. వాసవి అమ్మవారిని పల్లకిలో ఊరేగింపుగా బోసు బొమ్మ సెంటర్లోని శ్రీ వాసవి అమ్మవారి దేవస్థానం వద్దకు వచ్చిన తర్వాత అమ్మవారి వెండి విడుదమునకు మహిళలు తీసుకువచ్చిన జలకజములతో అభిషేకం నిర్వహించారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు కాసుల వెంకట రవీంద్ర గారి దంపతులు మరియు క్లబ్ సభ్యులు అందరూ కలిసి అమ్మవారికి చీర,సారె గాజులు పసుపు కుంకుమలు సమర్పించారు. వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు కాసుల వెంకట రవీంద్ర, సెక్రటరీ టంగుటూరి వీరబ్రహ్మం, ట్రెజరర్ గర్రె నరసింహారావు, వాసవి అమ్మవారి జయంతి కమిటీ చైర్మన్ మండవ వెంకట కిరణ్ కుమార్, ఇంటర్నేషనల్ పోగ్రామ్ కో ఆర్డినేటర్ గజవల్లి నాగ పవన్ కుమార్, జిల్లా వైస్ గవర్నర్ జివిఎల్ నాగేశ్వరరావు, వాసవి క్లబ్స్ సీనియర్ నాయకులు అప్పల రాజా, చిలంకూరి కోటేశ్వరరావు, గర్రె అనిల్, గట్టుపల్లి శ్రీనువాసరావు, పొత్తూరి రవీంద్ర, పచ్చిపులుసు రామాంజనేయులు, పేరూరి కృష్ణారావు, యూత్ క్లబ్ ప్రెసిడెంట్ గుర్రం బాల సాయి కుమార్, సెక్రటరీ దేసు హరి కుమార్, వాసవి క్లబ్, వాసవి క్లబ్ యూత్, వాసవి క్లబ్ వనిత సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నవగ్రహా ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 26)





వినుకొండ పట్టణంలోని బోసు బొమ్మ సెంటర్ వద్ద శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా ఈ వేడుకల్లో ఆదివారం దేవాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన నవగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం కార్యక్రమం లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీవీ మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమని పేర్కొన్నారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలను ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

బాల్ బ్యాట్మెంటన్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన ఛీఫ్ విప్ జీవి







**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 26)**

కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తూ పెద్ద పీట వేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ- పల్నాడు జిల్లా, ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారి సహకారంతో వినుకొండ చీరా హైస్కూల్లో బాలికల బ్యాడ్మింటన్ రెసిడెన్షియల్ వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ఏర్పాటు చేయగా ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని, ఉద్యోగాల్లో క్రీడాకారుల కోట రిజర్వేషన్ను 2% నుండి 3% కూటమి ప్రభుత్వం పెంచిందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో క్రీడలను నిర్లక్ష్యం చేశారని, ఆడుదాం ఆంధ్ర పేరుతో కోట్ల రూపాయలు దోపిడీ చేసి క్రీడారంగాన్ని దోచుకున్నారన్నారు. ఓటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రీడలతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని, వినుకొండ నుండి క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి వినుకొండ ఖ్యాతిని చాటాలన్నారు. అంతర్జాతీయ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో మంచి ప్రతిభ కనబరచాలని కోరారు. క్రీడాకారులకు శివశక్తి ఫౌండేషన్ ద్వారా తన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. స్పోర్ట్స్ కొటాలో ఉద్యోగం సాధించిన కోటేశ్వరి ని చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అన్ని దానాల్లో కెల్లా విద్యాదానం గొప్పది

ఘనంగా పూనూరు పాఠశాల వజ్రోత్సవాల

విద్యే జీవితాన్ని మలిచే మహాశక్తి

పూర్వ విద్యార్థుల సేవా స్ఫూర్తి అభినందనీయం

విద్యతోనే అద్భుత అవకాశాలు

జీవితానికి దిశ ,సాధనకు చదువే పునాది

పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే హామీ

ప్రభుత్వ విద్యకు దాతల అండ

పాఠశాల అభ్యున్నతికి సేవలందిస్తున్న వారికి ధన్యవాదాలు

రూ.70 లక్షల సీసీ రోడ్ ప్రారంభం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



**(షణ్ముఖ వెలుగు, యద్దనపూడి, ఏప్రిల్ 26)**

విద్యకు జీవితాన్ని మార్చే మహత్తరశక్తి అని,అన్ని దానాల్లో కెల్లా విద్యా దానం గొప్పదని,విద్యతో సాధించలేనిది ఏమీలేదని, విద్యా దానం చేస్తున్న ప్రతి ఒక్కరి సంకల్పం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం పూనూరు గ్రామంలోని గన్నమనేని కోటి స్వామి, మేడూరి కృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 75వ వార్షికోత్సవాలు (వజ్రోత్సవాలు) అట్టహాసంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు (సాంబన్న) హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మకంగా ప్రసంగించారు.పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు తమ మూలాలను మరచిపోకుండా తిరిగి వచ్చి, విద్యాసంస్థ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని అన్నారు. వివిధ రంగాల్లో స్థిరపడి ఉన్న పూర్వ విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో ముందుండటం వారి పాఠశాలపై ఉన్న మమకారాన్ని







ప్రతిబింబిస్తోందన్నారు. వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయడానికి దూర ప్రాంతాల నుంచి విచ్చేసిన పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, బోధన-బోధనేతర సిబ్బందికి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పూనూరు గ్రామ ప్రజలు ప్రతి కార్యక్రమాన్ని సమిష్టిగా విజయవంతం చేయడం అభినందనీయమని కొనియాడారు.

**విద్యతోనే అవకాశాలు -- జీవితానికి దిశ...**

"నేను ఈ స్థాయికి రావడానికి కారణం నా తల్లిదండ్రులు నేర్పిన విద్యే" అని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. చదువు లేకపోతే సమాజంలో అవకాశాలు లేవని, విద్య ద్వారానే మనిషి ఉన్నత స్థాయికి చేరుకుంటాడని అన్నారు. సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, అప్పుడు మాత్రమే బాధ్యతాయుత పౌరులుగా ఎదగగలమని సూచించారు.

తన విద్యాభ్యాస ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ...

కోనంకి, వలపర్ల గ్రామాల్లో చదువుకుని, ఎన్టీఆర్ హయాంలో గురుకులంలో బైపీసీ పూర్తి చేసి, అనంతరం ఆచార్య ఎన్.జీ. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (హార్టికల్చర్) పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యానవన అధికారిగా సేవలందించానని తెలిపారు. తర్వాత వ్యాపార రంగంలోకి ప్రవేశించి రైతులకు అండగా నిలవగలిగానంటే అది చదువుతో సాధ్యమైందని వివరించారు.

**పాఠశాల అభివృద్ధికి హామీ...**

పూనూరు పాఠశాల, గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉన్న సమస్యలను తన బాధ్యతగా తీసుకుని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే గన్నవరం-మార్టూరు రహదారిని ఈ వేసవిలో మెరుగుపరుస్తామని తెలిపారు. గ్రామంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

**విద్యాదానం గొప్పదానం....**

విద్యను ఆస్తిగా భావించి తరతరాలకు అందించేలా కృషి చేయాలని, అన్ని దానాల్లో విద్యాదానం అత్యుత్తమమని ఎమ్మెల్యే అన్నారు. పూర్వ విద్యార్థులు తమ గురువులను సత్కరించడం, వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆదర్శప్రాయమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్రామ ప్రముఖులను సన్మానించారు. తొలుత గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు.

**కన్నుల పండుగగా...**

పూనూరు పాఠశాల వజ్రోత్సవాలు కన్నుల పండుగగా, స్ఫూర్తిదాయకంగా నిలిచాయి.

విద్యాదానం గొప్పదే -- సమాజానికి మార్గదర్శకం

అన్ని దానాల్లోకెల్లా విద్యాదానం అత్యున్నతమని, చదువుతోనే జీవితంలో ఏదైనా సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. సమాజంలో ఇంకా మంచి ఆలోచనలతో ముందుకు సాగే వ్యక్తులు ఉండటం వల్లే విద్యకు ప్రాధాన్యం పెరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ప్రభుత్వ విద్యకు అండగా దాతలు...**

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు, పూర్వ విద్యార్థులు వెన్నుదన్నుగా నిలుస్తుండటం అభినందనీయమని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. వారి సహకారం వల్లే విద్యాసంస్థలు మరింత అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని పేర్కొన్నారు. పాఠశాల అభ్యున్నతికి కృషి చేస్తున్న వారికి కృతజ్ఞతలు పాఠశాల అభివృద్ధి కోసం సమయం, సంపద వినియోగిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దాతలకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వారి సేవాభావం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.

# సాగర్ రెండవ దశ పొడిగించి పొదిలి, మర్రిపూడి మండలాలకు సాగునీరందించాలి

### మంత్రి స్వామికి వినతిపత్రం అందించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

**(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, ఏప్రిల్ 26)**



ఉమ్మడి ప్రకాశం జిల్లాలో శాశ్వత కరువుతో ఇబ్బందులు పడుతూ, వెనుకబడిన ప్రాంతంగా ఉండి గతంలో ప్రతిపాదించిన సాగర్ కుడి కాలువ రెండవ దశ పొడిగింపులో ఉన్న పొదిలి, మర్రిపూడి మండలాలకు సాగునీటి వసతి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు రాష్ట్ర మంత్రివర్యులు డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి దృష్టికి తీసుకువచ్చారు. ఆదివారం మండలంలోని కెల్లంపల్లి గ్రామంలో శ్రీనివాసరావు మేనల్లుడి కుమారుడు రఘు, శిరీషల వివాహ మహోత్సవ సందర్భంగా హాజరైన ఆయన మంత్రి స్వామితో సమావేశమై వివిధ సమస్యలపై చర్చించారు. దశాబ్దాల తరబడి కరువు కాటకాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు తాగేందుకు గుక్కడు మంచినీరు లేక ఫ్లోరిన్ బారిన పడ్డారన్నారు. వర్షాభావం మీద ఆధారపడిన పంటలు సకాలంలో దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారని వివరించారు. ఉపాధి పనులు తగ్గి ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. మరీ ముఖ్యంగా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలలో ఫ్లోరిన్ శాతం అధికంగా ఉండడంతో ప్రజలు అనారోగ్యం పాలై, కిడ్నీలో దెబ్బతిని తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యల నేపద్యంలో గతంలోనే ప్రతిపాదించిన నాగార్జున సాగర్ కుడి కాలువ నిర్మాణం సందర్భంగా రెండవ దశ పేరుతో నిలిచిపోయిన కాలువను దర్శి దగ్గర నుండి పొడిగించి యర్ర ఓబనపల్లి వద్ద ముసి వాగులో కలపాలన్నారు. దీని ద్వారా మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలి మండలంతో పాటు కొండేపి నియోజకవర్గం లోని మర్రిపూడి, కొండేపి, పొన్నలూరు మిగిలిన ఇతర మండలాలకు సాగునీటి వసతి కల్పించేందుకు దోహదపడుతుందన్నారు. ఈ ప్రాంత శాశ్వత సమస్యలు పరిష్కారం అవుతాయి అన్నారు. రెండవ దశలో నిలిచిపోయిన సాగర్ కుడికాలువను ముసిలో కలిపి, ముసి ద్వారా కిందకు వచ్చే వాగు పై ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి నిత్యం కరువు మండలాలుగా ఉన్న ఈ ప్రాంతాలకు సాగునీటి వసతి కల్పించేందుకు ప్రభుత్వం వైపు నుంచి చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి వివరణ ఇస్తూ ఈ ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వానికి పంపామని మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దశాబ్దాలుగా వెనకబడిన ఈ ప్రాంత అభివృద్ధికి, సాగు తాగు నీటి సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ప్రకాశం జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రమేష్, కొండపి మండల సిపిఎం కార్యదర్శి కేజీ మస్తాన్, మార్కాపురం జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు నర్రా వెంకటేశ్వరరెడ్డిలు ఉన్నారు.

## పీఎంఈజీపీ కింద మంజూరైన కారును లబ్ధిదారుకు అందజేసిన మంత్రి డోలా



**(షణ్ముఖ వెలుగు, కొండపి, ఏప్రిల్ 26)**

పీఎంఈజీపీ కింద మంజూరైన కియా కారును మర్రిపూడి మండలం చిలంకూరు గ్రామానికి చెందిన లబ్ది దారురాలు మేలం అనిత కుటుంబ సభ్యులకు తూర్పు నాయుడు పాలెం క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అందజేశారు. (దీని యూనిట్ విలువ రూ.10 లక్షలు, సబ్సిడీ రూ.3,50,000) ఈ సందర్భంగా లబ్ధిదారురాలు కుటుంబ సభ్యులు మంత్రి స్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# పద్యం తెలుగు భారతికి సహృదయ నైవేద్యం

## టిటిడి ధర్మాచార్య ఎంవిఎస్ శాస్త్రి

## కంఠస్థ పద్యాల అప్పగింతలో ప్రతిభ చాటిన శ్రీగిరి బాల విహార్ విద్యార్థులు






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 26)

పద్యం తెలుగు భారతికి సహృదయ నైవేద్యమని టీటీడీ ధర్మాచార్య ఎంవిఎస్ శాస్త్రి పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చిన్మయ మిషన్ తోడ్పాటుతో శ్రీగిరి గో క్షేత్ర భవన్ లో ఏర్పాటైన శ్రీగిరి బాలవిహార్ కార్యక్రమంలో శాస్త్రి పాల్గొని తెలుగు పద్య వైభవం గురించి వివరించారు. వేమన ఆటవెలది పద్యాలతో ప్రతి ఒక్కరికి సులువుగా అర్థమయ్యే విధంగా సామాజిక స్పృహతో పద్యాలను రచించి చరితార్థుడయ్యాడని వివరించారు. వేమన శతక సాహిత్యం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

తల్లిదండ్రులు తమ పిల్లలకు మమ్మీ డాడీ పదాల స్థానంలో అమ్మా నాన్న అని పిలవడం అలవాటు చేయాలని శాస్త్రి కోరారు. మహాభారతంలోని ధర్మవ్యాధుడి కథ ద్వారా తల్లిదండ్రులను సేవించడం వల్ల ఎంతటి పుణ్యఫలం కలుగుతుందో శాస్త్రి తెలియచెప్పారు. శ్రీగిరి బాలవిహార్ విద్యార్థులు కంఠస్థ పద్యాలతో శ్లోకాలతో తమ ప్రతిభను చాటి చెప్పారు. రామాయణం బొమ్మల పుస్తకంలోని చిత్రాలకు రంగులు వేయడంతో పాటు అంత్యాక్షరి పోటీలో విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కార్యక్రమానికి ఆధ్వర్యం వహించారు. శ్రిష్టి పద్మావతి తదితరులు నిర్వహణా సహకారం అందించారు. శ్రీ గిరి దేవస్థానం నిర్వాహకులు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో పాటు భక్తులకు శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. శ్రీగిరి దేవస్థానం గో శాలలో శ్రీగిరి వేద పండితులు పి భాను ప్రకాష్ శర్మ గోపూజ నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం శ్రీగిరి దేవస్థానం.. చిన్మయ మిషన్ సంయుక్త నిర్వహణలో ప్రతి ఆదివారం శ్రీగిరి గో క్షే త్రంలో నిర్వహిస్తున్న శ్రీగిరి బాలవిహార్ శిక్షణా తరగతులను విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.

---

# అక్రమ మైనింగ్ పై కఠిన చర్యలకు అధికారులను ఆదేశించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

### అక్రమ మైనింగ్ పాల్పడితే సహించేది లేదని హెచ్చరిక




(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 26)

వినుకొండ నియోజకవర్గంలో మట్టి అక్రమ రవాణాపై ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తీవ్రస్థాయిలో స్పందించారు. వెంకుపాలెం పరిసరాల్లో యథేచ్ఛగా కొనసాగుతున్న మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్, మైనింగ్ ఏడి దాచేపల్లి వారిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరులు దోపిడీకి గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ,నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మైనింగ్ కు పాల్పడి ప్రభుత్వ సంపదను కొల్లగొట్టే వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్రమార్కులను ఉపేక్షించే ప్రసక్తే లేదని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి అక్రమ రవాణాకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రకృతి సంపదను కాపాడుకోవడంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులకు భరోసా ఇచ్చారు.

# జన గణనలో పాల్గొని దేశ పురోగతికి పాటుపడండి

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 26)

జిల్లాలోని ప్రజలు జనగణన లో పాల్గొని దేశ పురోగతికి పాటుపడాలని జిల్లా కలెక్టర్ ఏం విజయ సునీత సూచించారు. ఆదివారం పట్టణంలో స్వీయ జనగణన ప్రచారం పై నిర్వహించిన 5కే రన్ లో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం రెండు దశల్లో జరుగుతుందని తెలిపారు. ఈనెల 30 వరకు స్వీయ జనగణలో ప్రజలు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. మొబైల్ యాప్ ద్వారా స్వయంగా నమోదుకు చక్కని అవకాశం గా ఈ గణన ను అభివర్ణించారు. దేశ అభివృద్ధి వికసిత్ భారత్ 2047 లక్ష్యసాధనకు ఇది ఎంతో కీలకం కానుందని వివరించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క పౌరుడు జన గణన లో పాల్గొని దేశ పురోగతికి పాటుపడాలని తెలిపారు. పౌరుల పూర్తి వివరాలు సంక్షిప్తంగా నమోదు చేయబడతాయన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, డీఎస్పీ నాగరాజు, తాహసిల్దార్ చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.











---

# బద్వేల్‌లో రిటైర్డ్ డీఐజీ గుణశేఖర్‌రెడ్డి,ఏసీపీ కిరణ్ కుమార్ పర్యటన

## ఘన స్వాగతం పలికిన తులసి వెంకట శివనారాయణ







(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 26)

తెలంగాణ ఏసీబీ కిరణ్ కుమార్, రిటైర్డ్ డీఐజీ గుణశేఖర్‌రెడ్డిలు ఆదివారం కడప జిల్లా బద్వేల్ పట్టణంలో పర్యటించారు. బ్రహ్మంగారిమఠంలో జరిగిన ఆరాధన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన, అనంతరం బద్వేల్ పట్టణంలోని ప్రముఖులు తులసి వెంకట శివ నారాయణ స్వగృహానికి విచ్చేశారు. బద్వేల్ పట్టణానికి విచ్చేసిన రిటైర్డ్ డీఐజీ గుణశేఖర్ రెడ్డి, ఏసీపీ కిరణ్ కుమార్‌కి తులసి వెంకట శివ నారాయణ, వారి కుటుంబ సభ్యులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బద్వేల్ పట్టణానికి విచ్చేసిన రిటైర్డ్ డిఐజి గుణశేఖర్‌రెడ్డి, ఏసిపి కిరణ్ కుమార్‌రెడ్డి, డాక్టర్ నాగార్జున, లక్ష్మణరావు భోగేశ్వరరావు తిరుమల సాయికృష్ణ, టిడిపి నాయకులు రమేష్ నాయుడు, బిజెపి నాయకులు విశ్వనాథ్ ఆచారితో పాటు పలువురికి శాలువాతో కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వారి రాక పట్ల శివ నారాయణ సంతోషం వ్యక్తం చేస్తూ, మర్యాదపూర్వక గౌరవాన్ని చాటుకున్నారు. అనంతరం, అతిథి గౌరవార్థం శివ నారాయణ నివాసంలో ప్రత్యేకంగా తేనేటి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు పలు సామాజిక అంశాల గురించి, బ్రహ్మం గారి మఠం విశిష్టత గురించి కొద్దిసేపు చర్చించుకున్నారు. కిరణ్ కుమార్ వంటి ఉన్నతాధికారి తమ నివాసానికి రావడం పట్ల స్థానికులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపెంట సురేష్ బాబు, అడ్వకేట్ పత్తి నాగేంద్రప్రసాద్, విద్యావేత్త సివి నాగేశ్వరరావు, జొన్నలగడ్డ సుధాకర్, రవీంద్రబాబు, నిఖిల్, వల్లంకొండు రాఘవేంద్ర, పత్తి హరీష్, దద్దం వంశీతో పాటు పలువురు పాల్గొన్నారు.

---

# అనమనమూరులో కనుల పండుగగా అమ్మవారి ప్రతిష్ట కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఏప్రిల్ 26)

మండలంలోని అనమనమూరు గ్రామంలో ఆదివారం శ్రీ అంకమ్మ తల్లి గుడి, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు అత్యంత ఆర్భాటంగా జరిగాయి. ఉదయం నుంచి పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులే కాక నియోజకవర్గం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయానికి విరాళాలు ఇచ్చిన దాతలు కూడా సుదీర్ఘ ప్రాంతాల నుంచి వచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. వారిని సర్పంచుల సంఘం అధ్యక్షులు హరిబాబు సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. ఈ పూజ కార్యక్రమాలలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అంతర్గత సహాయకులు శ్రీనివాసరావు పాల్గొని పూజలు జరిపారు. వేద పండితులు వారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తొలుత హరిబాబు ఆయనను శాలువాతో సత్కరించి సాదరంగా స్వాగతం పలికారు. తరలివచ్చిన భక్తులందరికీ భారీగా అన్నదానం నిర్వహించారు. అనంతరం రాత్రికి ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభలు కాంతులతో సాంస్కృతిక కార్యక్రమాలు హోరెత్తించాయి. ఈ కార్యక్రమంలో కూడా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఆనందంగా తిలకించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం అధ్యక్షులు జంపు హరిబాబు అమ్మవారి గుడి, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. గుడి కార్యక్రమానికి దాతలు, గ్రామస్తులు, మండలంలో ఉన్న పెద్దలు అందించిన సహకారం మరవలేనిదని ఆయన చెప్పారు. పేరుపేరునా అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలియజేశారు.



# మార్కాపురం సీఐగా అల్తాఫ్ హుస్సేన్ బాధ్యతల స్వీకరణ






(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 26)

మార్కాపురం నూతన సీఐగా ఎస్ కె అల్తాఫ్ హుస్సేన్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఫోకస్ చేస్తానని చెప్పారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుంటానన్నారు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తూ ప్రజలకు భద్రత కల్పిస్తానన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం టౌన్ ఇన్‌ఛార్జి ఎస్ఐ ఆరోహన్, రూరల్ ఎస్ఐ వి వేమనలు, పోలీసు సిబ్బంది ఆయనకు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.